పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

ఓదెల: కొలనూర్‌లో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ముత్తారం : శాత్రాజ్ పల్లికి ట్రాక్టర్ పై వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

పెద్దపల్లి రూరల్ : నిట్టూరుకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

జ్యోతినగర : పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ఓదెల, మే 12: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఓదెల మండలంలో 35,274 ఓటర్లు ఉండగా, 40 పోలింగ్ కేంద్రా లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పీవోతో పాటు ఏపీవో, ఇద్దరు ఓపీలు ఉండనున్నారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ సిబ్బందికి కార్యదర్శులు, బీఎల్వోలు స్వాగతం పలికారు. సోమవారం జరగనున్న పోలింగ్‌కు కావాల్సిన ఏర్పాట్లను ఎన్నికల సిబ్బంది చేసుకుంటున్నారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్, మే 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పోలీసు సిబ్బందితో సహా పెద్దపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చేరుకున్నారు. మండలంలోని 30 గ్రామపంచాయితీలకు సంబంధించిన అధికారులు పోలింగ్‌కు సంబంధించిన సామాగ్రితో కేంద్రాలకు చేరుకోవడంతో పలు గ్రామాలను సందర్శించిన ఎంపీవో సుదర్శన్ ఆయా పంచాయతీల కార్యదర్శులతో పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలింగ్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కార్యదర్శులకు సూచించారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి, మే 12 : మండలంలోని 24 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 21,964 మంది ఓటర్లున్నారనీ, ఇందులో మహిళలు 11,117, పురుషులు 10,847 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని వివరించారు. వంద శాతం పోలింగ్ నమోదు దిశగా ప్రతి ఒక్కరూ కేంద్రాలకు వచ్చి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మారం మండలంలో..

ధర్మారం, మే 12: ధర్మపురి నియోజకవర్గ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది ధర్మారం మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సెక్టార్ అధికారులు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేష్, మిషన్ భగీరథ డీఈఈ రోహిత్, నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్, పీఆర్ ఏఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య వా హనాల్లో సిబ్బంది ఈవీఎం, ఇతర మిషనులు ఇతర సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గ్రామపంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు పోలింగ్ సిబ్బందికి స్వాగతం పలికారు. మండలంలో 29 గ్రామాలు ఉండగా, (జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంతో కలి

బి:ధర్మారం: దొంగతుర్తి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

పి) 53 పోలింగ్ కేంద్రాలు ఉండగా మండల వ్యాప్తంగా 45 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఎస్సై టి సత్యనారాయణ,ఎస్సై-2 అశ్విని ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్సు నిర్వహిస్తున్నారు.

ముత్తారంలో..

ముత్తారం, మే 12: మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల కు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలతో చేరుకున్నారు. రామగిరి జేఎన్టీయూలో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎంపీడీవో లలిత, ఎంపీవో బైరి వేణుమాధవ్ స్వాగతం పలికారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం తాగునీరు, నీడ సౌకర్యం కల్పించారు.

శాత్రాజుపల్లిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

పారుపల్లి పంచాయతీ పరిధి మానేరు అవతలి ఒడ్డున ఉన్న శాత్రాజుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. శాత్రాజుపల్లి గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి సారి 5 కిలోమీటర్ల దూరం కాలినడనక వచ్చి ఓటు వేశారు. ఎన్నికల సమయంలో ఓటింగ్ లో పాల్గొనేందుకు శాత్రాజుపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఎన్నికల అధికారులు గ్రామంలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తో గ్రామస్తులకు ఇబ్బందులు తొలగాయి. గ్రామానికి మానేరు వాగు అడ్డుఉండడంతో సిబ్బంది ట్రాక్టర్‌పై వెళ్లారు. గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు..

జ్యోతినగర్, మే 12: ఎన్టీపీసీలోని జడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో వారి కి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో తరలివెళ్లారు. అంతకుముందు ప్రిసిండెంగ్, అసిస్టెంట్ ప్రెసిండింగ్, సెక్టోరల్ అధికారులు విధులకు హాజరైనట్లుగా అందించిన ఆర్డర్ కాఫీని తీసుకున్నా రు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆర్వో, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సాధారణ పరిశీలకుడు రావిశ్‌గుప్తా వేర్వే రుగా సందర్శించి పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును పర్యవేక్షించారు. రామగుండం ఏఆర్వో జే అరుణశ్రీ, నోడల్ ఆఫీసర్లు రామగుండం, పాలకుర్తి, అంతర్గాం తహసీల్దార్లు కుమారస్వామి, జ్యో తి, రామ్మోహన్, ఎంఈవో రాజయ్య, ఉన్నారు.

ముత్తారం : పోలింగ్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న అధికారులు

జ్యోతినగర్: స్ట్రాంగ్ రూంల నుంచి ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది

జూలపల్లి : మండలానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

జ్యోతినగర్, మే 12: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న 1,850 పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. రామగుండం నియోజకవర్గ పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్టీపీసీ జడ్పీ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలను అప్ప జెప్పాలన్నారు. రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామగ్రి సెక్టార్ ఆఫీసర్ల వద్ద భద్రంగా ఉంచాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 260 పోలింగ్ సెంటర్లలో సజావుగా పోలింగ్ జరిగేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్ల కోసం చల్లని తాగునీరు, క్యూలైన్ వద్ద టెంట్, ఇతర వసతులు కల్పించామన్నారు. ఎన్నికల్లో మనం వేసే ఓటు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని,ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

పోలింగ్ విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

రామగిరి, మే 12: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. మండలంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలనీ, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని రిజర్వు ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేసే ప్రక్రియను పరిశీలించడం జరిగిందనీ, పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో 1850 పోలింగ్ కేంద్రాల వద్ద 13న జరిగే ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తప్పనిసరిగా ఓటర్లు పోలింగ్ పాల్గొనేందుకు కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు అరుణ శ్రీ, హనుమనాయక్ ఇతర అధికారులు ఉన్నారు.

రామగిరి : డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు : సీపీ శ్రీనివాస్

ఫ్రటైజర్‌సిటీ/ రామగిరి, మే 12: పార్లమెంట్ ఎన్నికలకు రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్, పన్నూర్, రామగిరి మండలం, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. ఆయాచోట్ల సీపీ మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూషన్ సెంట ర్ల నుంచి సెక్టార్, పోలీసు రూట్ మొబైల్, ఆర్మ్డ్ అధికారులతో పోలింగ్ అధికారులను పోలింగ్ పరికరాలను పోలింగ్ లోకేషన్లకు పటిష్టమైన భద్రతతో తీసుకెళ్లామన్నారు. 832 మంది సివిల్ ఫోర్స్, 384 వింగ్స్ ఫోర్స్, 300మంది హోంగార్డ్సు మరో 300మంది శిక్షణ కానిస్టేబుళ్లు, ఛత్తీస్‌గఢ్ నుంచి 91మంది హోంగార్డ్సు, ఎస్‌సీసీఎల్ అండ్ పీసీ 91మంది, 64 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, వరంగల్ సీటీసీ నుంచి 12 మంది, 443మంది ఎన్‌సీసీ కేడెట్స్, ఐదు కంపెనీల కేంద్ర బలగాలు మొత్తం 3,300మంది పోలింగ్ బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు, మానిటరింగ్ కంట్రోల్ గది ఏర్పాటుతో 48గంటల పాటు సైలెన్స్ పీరియడ్‌లో లాడ్జిలు, ఫంక్షన్ హాల్స్, గెస్ట్ హౌస్‌లను తనిఖీ చేసి బయట నుంచి వ్యక్తులను పంపించి వేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతా పోలింగ్‌లో ఏరియాలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు, సరిహద్దు రాష్ట్రా ల ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు. ఎన్నికల పక్రియకు భంగం కలిగించిన అల్లర్లకు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారదర్శంగా పోలింగ్

పెద్దపల్లి, మే12: పెద్దపల్లి నియోజక వర్గం పరిధిలో లోక్ సభ సాధారణ ఎన్నికల పారదర్శకంగా నిర్వహించాలని పెద్దపల్లి ఆర్డీవో, సహాయ ఎన్నికల అధికారి బీ గంగయ్య పోలింగ్ అధికారులు, సిబ్బంది సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసప్షన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. మాక్ పోలింగ్, పోలింగ్ శాతం నమోదు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలోని 290 పోలింగ్ కేంద్రాలకు గానూ 27 కౌంటర్లు ఏర్పాటు చేసి, 27 సెక్టార్లు, 35 రూట్లుగా విభజించి, ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ సిబ్బందిని తరలించారు. పోలింగ్‌కు 27 మంది సెక్టార్ అధికారులు, 1200 మంది పోలింగ్ సిబ్బంది కేటాయించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈవో డీ మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పెద్దపల్లి: పెద్దపల్లి డీఆర్‌సీలో ఏర్పాటు చేసిన కౌంటర్ నుంచి పోలింగ్ సామగ్రితో సిబ్బంది

రామగిరి : పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

ఘనంగా మాతృదినోత్సవం

జ్యోతినగర్ మే 12: ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాలికల సాధికారత శిక్షణ బాలికలు ఆదివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో వారి తల్లులతో మాతృదినోత్సవాన్ని జరుపుకున్నారు. మాతృమూర్తులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరై మదర్స్‌డే కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ కార్యక్రమ ఇన్‌చార్జి వీ పద్మశ్రీ ఉన్నారు.

దీప్తి మహిళా సమితి సభ్యులకు పూలతో స్వాగతం పలుకుతున్న బాలికలు

వైకే ఫౌండేషన్‌కు జాతీయ ఖ్యాతి స్వర్ణ నంది అవార్డు ప్రదానం

యైటింక్లయిన్ కాలనీ, మే 12: యైటింక్లయిన్ కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్‌కు జాతీయ ఖ్యాతి దక్కింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ శ్రీ, లంబోదర కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం వైకే ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి స్వర్ణ నంది అవార్డును ప్రదానం చేశారు. సినీ దర్శకులు రాజ్ స్వరూప్, జాతీయ మానవ హక్కుల చైర్మన్ డాక్టర్ బాబు ఈ అవార్డును ఫౌండేషన్ అధ్యక్షులు కండెం సురేశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ ఈ అవార్డును తమ ఫౌండేషన్ వలంటీర్లకు అంకితమిస్తున్నామని వేదికపై ప్రకటించారు. రక్తదానం, అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను పలువురు అభినందించారు.

'ఖని'లో మళ్లీ తాగునీటి కష్టాలు

● ట్యాంకర్ ద్వారా నీరందించిన కార్పొరేటర్

33వ డివిజన్‌లో ట్యాంకర్ ద్వారా నీటిని పడుతున్న కార్పొరేటర్

కోల్‌సిటీ, మే 12: తొమ్మిదేండ్ల తర్వాత రామగుండంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆదివారం 33వ డివిజన్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నది. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి మంచినీటి ట్యాంకర్ ద్వారా ఆ కాలనీ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాడు. ఐతే ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు అప్పుడెప్పుడో ఇట్ల నీటి కోసం తిప్పలు పడేటోళ్లం... మళ్లా ఇన్నాళ్లకు అవే రోజులొచ్చాయంటూ చర్చించుకున్నారు. మొన్నటి వరకు మిషన్ భగీరథ కింద అన్ని ఏరియాలకు నిరాటంకంగా నీటి సరఫరా జరిగేది. కానీ, ఇన్నాళ్లకు మళ్లీ ఖనిలో పలు ప్రాంతాల్లో మంచినీటి కోసం ట్యాంకర్లు తిరుగుతున్న రోజులొచ్చాయి.

విద్యార్థిని అభినందించిన మంత్రి

విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

మంథని, మే12: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపినవిద్యార్థిని పర్ష మాధురిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అభినందించి ఘనంగా సన్మానించారు. మల్లారం గ్రామానికి చెందిన పర్ష సంతోష్ కుమార్ - కోమలతల కుమార్తె మాధురి ఇంటర్మీడియట్ ఫలితాల్లో బైపీసీ మొదటి సంవత్సరంలో 440 మార్కుల గాను 434 మార్కులు రావడంతో మంత్రి శ్రీధర్ బాబు విద్యార్థిని అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, తదితరులున్నారు

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

ధర్మారం,మే12: కరీంనగర్ ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మల్లాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరి విద్యార్థినిలకు ఉచిత మోటివేషన్ తరగతులు నిర్వహించారు.గురుకులాల్లో చదివి ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థినులు ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన గురుకుల కళాశాలల కు చెందిన సుమారు 250కి పైగా విద్యార్థులు ఈ విద్యాలయంలో ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతున్నారు.ఈ క్రమంలో ఈ విద్యార్థులకు ఇంపాక్ట్ క్లబ్ మోటివేషన్ తరగతులు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పన్నగారి వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు చదివిన విషయాలు మరిచిపోవడానికి గల కారణాలను వివరిస్తూ సులువుగా చదివిన విషయాలు ఎక్కువ రోజులు గుర్తుంచుడానికి కావలసిన మెమోరీ టెక్నిక్ లు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, డైరెక్టర్ కుతాడి తిరుపతి ఇంపాక్ట్ ట్రైనర్ ఆవుల సుధాకర్, ప్రిన్సిపాల్ గిరిజ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు కూడా పాల్గొని ఇంపాక్ట్ సభ్యులను అభినందించారు.

అక్రమాలపై చర్యలను తీసుకోవాలి

పోలీసులకు విన తిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుల్తానాబాద్ రూరల్,మే 12:లారీలకు భవన నిర్మాణ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకొని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలను తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. కదంబాపూర్ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులతో కలసి దాసరి ఉష అడ్డుకున్నారు. వాటిని సుల్తానాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతు. గ్రామం నుంచి గత కొంత కాలంగా లారీలకు భవన నిర్మాణ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. ఇదేంటి అని ఎదురు తిరిగిన యువకులు, ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారని, భయాందోళనకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులపై చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో రఫీక్, వహీద్, వెంకటేశ్, అజయ్,మనోజ్, భూమేశ్, గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

రూ. 2 .14 కోట్లు జప్తు

● రూ. 2.8 కోట్లు విడుదల

పెద్దపల్లి, మే12: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 2 కోట్ల 14 లక్షల 4 వేల 742 జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ రూ. 2 కోట్ల 8 లక్షల 13 వేల 242 రూపాయలను విడుదల చేసిం దని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా రూ. 5 లక్షల 91 వేల 500 విడుదల చేయలేదని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే13: మండలంలోని పెద్దరాత్‌పల్లి గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాస్ అనే గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలైనట్లు మాజీ సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు గమనించి వెంటనే చికిత్సనిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

జూలపల్లి, మే 12 : కోనరావుపేటలో అంగన్‌వాడీ ఆయా చిలుముల అనంతమ్మ (61) వడదెబ్బతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతమ్మ దాదాపు 33 ఏండ్ల నుంచి ఆయాగా పని చేస్తూ ఒంటరిగా జీవిస్తుంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురైంది. వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ ఆరోగ్యం బాగు చేయించుకోడానికి ఆసుపత్రికి వెళ్లినా కుదుటపడక చనిపోయినట్లు పేర్కొన్నారు.